గడప గడపకూ సంక్షేమం


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రేగిడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గడప గడపకూ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న సదరు నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ గతంలోని టీడీపీ ప్రభుత్వం ప్రజలకు మంచి చేసే పథకాలు ఒక్కటీ అమలు చేయకపోగా, నీరు–చెట్టు పథకం పేరిట రాష్ట్ర ఖజానాను దోచుకుందని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99.5 శాతం హామీలు నెరవేర్చి, చరిత్ర సృష్టించారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్నివర్గాల ప్రజలకు అన్నివిధాలా మేలు జరిగిందన్నారు. ఇవే సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్ మాట్లాడుతూ ఆడిన మాట తప్పని, మడమ తప్పని నేతగా సీఎం జగనన్న పేరు తెచ్చుకున్నారన్నారు. నవరత్నాలు(పథకాలు)తో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఆయన ఇచ్చిన మరెన్నో హామీలను నెరవేర్చారన్నారు. మనమంతా బాగుండాలంటే సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారిని ఆనుకుని సీసీ రోడ్డు, మురుగుకాలువల నిర్మాణానికి సదరు నేతలు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు, సర్పంచ్ కెంబూరు తేజ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, పోలేటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కింజరాపు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కరణం గోవిందరావు, కరణం శ్రీనివాసరావు, చుక్క వెంకటనాయుడు, మొయ్యి కృష్ణమూర్తినాయుడు, ఎంపీడీవో శ్యామలాకుమారి, ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం


బాడంగి సీహెచ్‌సీ హెచ్‌డీఏసీ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ(హెచ్‌డీఏసీ) సమావేశం మంగళవారం జరిగింది. కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సమావేశానికి హాజరై, ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆస్పత్రి అభివృద్ధి చర్యలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రోగం నయమయ్యేంత వరకు వారిని బాగా చూసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా సిబ్బంది కొరత విషయం సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో పాటు హెచ్‌డీఏసీ నిధులతో మందులు, స్టేషనరీ కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, ఆస్పత్రి కొత్త భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వైద్యం ఎలా అందుతోందని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కమిటీ సభ్యులు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఆవు సత్యనారాయణ, ఎంపీడీవో ఆంజనేయులు, కన్వీనర్ కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామభద్రపురం మండలంలోని బూశాయవలస గ్రామానికి చెందిన పట్నా నిహాల్‌కుమార్, బాడంగి మండలంలోని పి.వెంకటంపేట గ్రామానికి చెందిన అల్లు ఆదినారాయణలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, తెర్లాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటింటికీ 'అయోధ్య' అక్షతలు


అక్షతల ప్యాకెట్లతో గురవాం గ్రామస్తులు

రాజాం: మండలంలోని గురవాం గ్రామంలో ఇంటింటికీ అయోధ్య రామమందిరం అక్షతలు మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, రాముడికి పూజలు చేసిన అక్షతలను పంచిపెడుతున్నట్లు శ్రీరామభక్త బృందం సభ్యులు కెంగువ హరిప్రసాద్, లంకలపల్లి లక్ష్మణరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

మెంటాడ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆలయంలో కొలువైన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి కర్పూర సేవ చేశారు. ఈ నెల 13వ తేదీన జరిగే గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయని భక్తులు తెలిపారు.

బాడంగి సీహెచ్‌సీ హెచ్‌డీఏసీ సభ్యురాలిగా శారద


శారద

బాడంగి: స్థానిక సీహెచ్‌సీ(ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి) హెచ్‌డీఏసీ(ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ) సభ్యురాలిగా గండి శారదను నియమించినట్లు కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఖాళీగా ఉన్న కమిటీ సభ్యురాలి స్థానం అంశం సమావేశం దృష్టికి రాగా, ఆమె పేరును కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. డొంకినవలసకు చెందిన శారద గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె భర్త శంకరరావు ప్రస్తుతం సచివాలయ కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు.

సకాలంలో రైతులకు ట్రక్కు షీట్లు అందివ్వాలి

రాజాం: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయిస్తున్న రైతులకు సకాలంలో ట్రక్కు షీట్లు అందివ్వాలని ఏవో ఎ.రేణుకాసాయి సిబ్బందికి సూచించారు. మండలంలోని కొత్తవలస, మారేడుబాక, కంచరాం గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆమె రైతు భరోసా కేంద్రాల్లో నమోదైన ఈ–క్రాప్ వివరాలు పరిశీలించడంతో పాటు విక్రయించేందుకు తీసుకువస్తున్న ధాన్యంలో తేమశాతం, నాణ్యత కొలిచే పరికరాలను గమనించారు. ధాన్యాన్ని ఆరబెట్టి, తేమశాతం తగ్గించేలా చూడాలని రైతులకు తెలిపారు. దళారులను ఆశ్రయించి, మోసపోవద్దన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

రేగిడి: గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు యువతకు సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఆయన మంగళవారం వెళ్లి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఎంతోమంది యువతీయువకులు, విద్యార్థులు గంజాయి, మద్యానికి బానిసలై, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. నిషేధిత పదార్థాలు అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పూరిపాక దగ్ధం

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో చింత చిన్నఅప్పలనాయుడుకు చెందిన ఓ పూరిపాక, గడ్డివాము దగ్ధమయ్యాయి. ఇదే షెడ్డులో పార్కింగ్ చేసిన టీవీఎస్ ద్విచక్ర వాహనం, ఇంజిన్ పైపులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరావాల్సి ఉంది. వీఆర్వో రాజు బాధిత రైతు వద్ద వివరాలు సేకరించి, తహసీల్దార్‌కు నివేదిక అందించారు.

జీరో టిల్లేజ్ విధానంతో మేలు

బొబ్బిలి: మొక్కజొన్న సాగులో జీరో టిల్లేజ్ విధానంతో మేలు అని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందరరావు అన్నారు. మండలంలోని కొత్తపెంట గ్రామంలో జీరో టిల్లేజ్ విధానంపై రైతులకు మంగళవారంఅవగాహన కల్పించారు. సాగులో ఈ విధానం పాటించడం ద్వారా సాగు ఖర్చు తక్కువ అవుతుందని, మంచి దిగుబడి వస్తుందన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు మంగళవారం వేశారు. గ్రామ సచివాలయ పరిధిలోని పశుసంవర్ధక శాఖ సహాయకులు తమ గ్రామాల పరిధిలోని పశువులకు పలు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు.

ఆనందమని 'పింఛెన్'!


రాజాం: బొద్దాంలో పింఛన్ పెంపు నేపథ్యంలో ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు


రాజాం సిటీ: పొగిరిలో లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

పింఛన్ల పంపిణీ పండగలా జరుగుతోంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పలువురికి పెన్షన్ నగదు అందజేశారు. ఈ నెల నుంచి లబ్ధిదారులందరికీ నెలకు రూ.3 వేలు చొప్పున అందిస్తుండడంతో ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో నలభై ఏళ్లు సీఎం జగనన్నే ముఖ్యమంత్రిగా కొనసాగాలని అందరూ కోరుకుంటుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్


రేగిడి: అప్పాపురంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు


రాజాం: లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ తవిటమ్మ


రామభద్రపురంలో ఎంపీపీ లక్ష్మణరావు చేతులమీదుగా పింఛన్ల పంపిణీ


బాడంగిలో పార్టీ మండల కార్యదర్శి బంగారురాజు సమక్షంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్

ప్రజాసంకల్పయాత్రతో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


బొబ్బిలి: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ప్రతిపక్ష నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రతోనే ప్రస్తుతం రాష్ట్రంలో ఇంటింటా నెలకొన్న సంక్షేమ వెలుగులు సాధ్యమయ్యాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రజాసంకల్పయాత్ర విశేషాలు గుర్తు చేసుకున్నారు. ఈ యాత్ర ద్వారానే జగనన్న ప్రజల కష్టాలు తెలుసుకోగలిగారన్నారు. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజలకు కష్టాలను దూరం చేశారన్నారు. అన్నివర్గాల ప్రజలకు అన్నివిధాలా అండగా నిలుస్తూ, సుపరిపాలన అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలు అమలు చేసి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అటువంటి మనసున్న నేతకు మనమంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మి అప్పలనాయుడు, పార్టీ తెర్లాం మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సామాజిక న్యాయం

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ అన్నారు. ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పట్టణంలోని మాధవబజారులో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు అక్కడి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ తర్వాత ఆయన యాత్ర విశేషాలు, యాత్ర ద్వారా సాకారమైన కలలను గుర్తుచేశారు. రాష్ట్రంలోని ప్రతీవర్గంలోని ప్రజలు ఇప్పుడు సుఖసంతోషాలతో జీవిస్తున్నారంటే కారణం ఆనాడు జగనన్న చేపట్టిన ప్రజాసంకల్పయాత్రేనన్నారు. ఈ యాత్ర ద్వారానే ఆయన ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను యాత్రకు ముందు యాత్ర తర్వాత అని చెప్పుకోవచ్చన్నారు. దీనిని బట్టి యాత్ర ప్రభావం, ఫలితాలు ఎంతగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా ఎన్నుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు వంజరాపు విజయ్‌కుమార్, నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, దూబ గోపాలం, పిట్టా జగదీష్, గోకవలస బాబూరావు, డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మెంటాడ: వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు


రాజాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

మెంటాడ: ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఇద్దనవలస గ్రామంలో పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సీఎం జగనన్న ఆనాటి యాత్ర ద్వారా తెలుసుకున్న ప్రజల కష్టాలను దూరం చేస్తూ కొనసాగిస్తున సుపరిపాలనను తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో..

ప్రజలకు మెరుగైన వైద్యం

- జెడ్పీటీసీ గర్భాపు ఉదయభాను


తెర్లాం: కాగాంలో వైద్య తనిఖీల అనంతరం ప్రిస్క్రిప్షన్ రాస్తున్న వైద్యుడు


మెంటాడ: కొంపంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో చేస్తున్న నేత్రవైద్య తనిఖీలు

తెర్లాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెర్లాం జెడ్పీటీసీ గర్భాపు ఉదయభాను అన్నారు. మండలంలోని చీకటిపేట గ్రామసచివాలయం పరిధిలోని కాగాం గ్రామంలో పెరుమాళి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శిబిరానికి వచ్చి, అవసరమైన వైద్యసేవలు పొందాలని కోరారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

మెంటాడ: మండలంలోని కొంపంగి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోని ప్రతిచోటా ఇటువంటి శిబిరాలు నిర్వహించి, వైద్యసేవలు అందజేయడం జరుగుతోందని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటినుంచి మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా'


తెర్లాం: మండల స్థాయి క్రికెట్ పోటీలకు సిద్ధం చేసిన మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకే పోటీలు ప్రారంభిస్తున్నామని, దీనికి సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తొలుత జరిగే క్రికెట్ పోటీలో ముగడ, పాల్తేరు గ్రామ సచివాలయాల పరిధిలోని జట్లు తలపడనున్నాయన్నారు. ఆ తర్వాత కోటిపల్లి, భీమవరం జట్లు, తెంటువలస, గూడెపువలస జట్లు, గొల్లాది, బాడంగి–2 జట్లు పోటీపడతాయన్నారు.

తెర్లాం: మండలంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు, క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంతో పాటు మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రఘునాథాచారి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఉదయం 9 గంటలకు వాలీబాల్, ఖోఖో పోటీలు, మందరాడలో బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు.

7,350 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

బాడంగి: మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల ద్వారా 7,350 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఏవో కె.శిరీష మంగళవారం తెలిపారు. మండలంలో 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా 11 వేల టన్నుల వరకు కొనుగోలు జరిగే అవకాశమున్నట్లు పేర్కొన్నారు. రబీ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు కూడా 50 శాతం వరకు పూర్తయిందన్నారు.

11 మద్యంసీసాల స్వాధీనం

సంతకవిటి: మండల కేంద్రంలోని దేవాంగుల వీధిలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న 11 మద్యంసీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.దుర్గాప్రసాదరావు తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా అనుమతులు లేకుండా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్పత్రికి వెళ్లి, పింఛన్ అందజేత


జానకమ్మకు పింఛన్ నగదు అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు

వంగర: మండలంలోని ఇరువాడ గ్రామానికి చెందిన రుద్రవరపు జానకమ్మ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె సంబంధిత చికిత్స పొందుతోంది. ఈ మేరకు మండలంలోని కోనంగిపాడు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వై.ఉమామహేశ్వరరావు మంగళవారం ఆస్పత్రికి వెళ్లి మరీ ఆమెకు పింఛన్ నగదు అందజేశారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు


విద్యార్థుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం, యోగా వంటివి చేయాలని, మంచి ఆహారం తీసుకోవాలని, పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓనెఅగ్రహారంలో జిల్లా స్థాయి పోటీలు

వంగర: మండలంలోని ఓనెఅగ్రహారం గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ యువనేత కాబోతుల శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు పోటీలు ఉంటాయని, పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 11వ తేదీలోగా రూ.400 ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేత జట్లకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.5 వేలు, తృతీయ బహుమతి కింద రూ.3 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8074057101ను సంప్రదించాలని కోరారు.